కథ

# భలే భుజంగరావు

భీమరాజు వెంకటరమణ

ప్రొద్దుటే పాలపాకెట్ వేసి వెళుతున్న కుర్రాడితో భుజంగరావు "ఆజ్ ఏక్ నయ్ తీన్ హోనా" అన్నాడు.

"ఏమిటి సార్! అర్థంకావడం లేదు" అన్నాడు పాలవాడు.

"హిందీ నయ్ మాలూమ్?" అడిగాడు భుజంగరావు.

పాలవాడు బిక్కమొహం వేసుకొని చూస్తుంటే లోపల నుంచి భార్య అన్నపూర్ణ వచ్చి "ఇవాళ మూడు పాకెట్స్ కావాలి" అన్నది. ఆమెకు పాకెట్స్ ఇచ్చి భుజంగరావ్‌ని అదోలా చూస్తూ వెళ్ళాడు పాలవాడు.

"ఏమిటండి మీరు! మీ హిందీ ప్రతాపం పాలవాడి మీద కూడా చూపాలా? వాడు బెదిరిపోయి పాకెట్స్ వేయడం మానేస్తే ప్రొద్దున్నే లేచి మనమే ఆ వీధి చివరకు వెళ్ళి తెచ్చుకోవాలి. అయినా మీ భాషతో ఇంట్లో నన్ను చంపుతున్నారుగా ఇంకా బయట వాళ్ళ నెందుకు భయపెడతారు?" అన్నది విసుగ్గా.

"కామోష్! జల్దీ నాస్తా తయార్ కరో! ముఝే బాహర్ జానాహై! సంఝే!" అంటూ లోపలికి వెళ్ళాడు.

"ఖర్మ ఖర్మ" అనుకుంటూ తనూ లోపలికి నడిచింది అన్నపూర్ణ.

భుజంగరావు బయటకు వెళ్ళగానే ఫోన్ మ్రోగింది. కుమార్తె భవాని రాజమండ్రి నుంచి- "అమ్మా! వెంకట్ ఇంటర్ పరీక్షలు బాగా వ్రాసాడు. అనుకున్నట్లు మేము రాత్రికి బయలుదేరి రేపు ఉదయానికి ఒంగోలు చేరుతాం, నీ పుట్టినరోజు పండుగ జామ్ జామ్ అని జరపాలని అంటున్నాడు మీ మనవడు" అన్నది.

"చాలా సంతోషం రండి, నా పుట్టినరోజు సంగతి ఎట్లా ఉన్నా నీకు చాలా చెప్పాలి" అన్నది అన్నపూర్ణ.

"ఏమిటి విషయం చెప్పవూ?" అడిగింది భవాని.

"ఫోనులో కాదులే రండి చెబుతాను" అని ఫోను పెట్టేసింది.

మరునాడు ఉదయం ఎప్పుడెప్పుడు కూతురు, అల్లుడు, మనవడు వస్తారా అని ఎదురుచూస్తున్న అన్నపూర్ణకి తలుపుకొట్టిన చప్పుడు అయింది. తను తీసే లోపు భుజంగరావు వెళ్ళి తలుపు తీసాడు.

"హాయ్! తాతయ్యా!" అన్నాడు మనవడు వెంకట్.

"మామగారూ! బావున్నారా!" అడిగాడు అల్లుడు ఆనంద్.

"నాన్నా! ఎలా ఉన్నావ్? అమ్మేది?" అంటూ అందరితోపాటూ లోపలికి నడిచింది భవాని.

"మై అచ్చా హూ! అప్ కైసే హై దామాద్ జీ?" అడిగాడు భుజంగరావు ఆనంద్‌ని. అతను కాస్త విస్తుపోయి 'బావున్నాను' అని మాత్రం అన్నాడు.

"తుమ్ కైసే హోరే!" అన్నాడు మనవణ్ణి చూసి.

భవాని వాళ్ళ అమ్మతో మాట్లాడుతున్నది, వెంకట్ మాత్రం 'తాతయ్య ఏమిటి సీరియస్‌గా హిందీ మాట్లాడుతున్నాడు?' అనుకుంటున్నాడు.

"తుమ్ సబ్ లోగ్ తయ్యార్ హోజావ్! మై బాజార్ జాకే అభీ అవుంగా!" అంటూ బయటకు వెళ్ళాడు భుజంగరావు.

"ఏమిటి అమ్మా! నాన్న తెలుగే మాట్లాడటం లేదు?" అడిగింది భవాని.

"ఏమి చెప్పమంటావే తల్లీ! ఈమధ్య మీ నాన్న హైదరాబాద్ వెళ్ళినప్పుడు చార్మినార్ దగ్గర తన చిన్ననాటి స్నేహితుడు బషీర్ అహ్మద్ కలిసాడుట, వాళ్ళింట్లో పది రోజులు ఉండి మొన్ననే ఒంగోలు వొచ్చారు. రెండు రోజుల నుండి ఆ భాషతో నన్ను, పాలవాడిని, పేపరు వాడిని, పొరపాటున ఇంటికి ఎవరైనా వస్తే వాళ్ళని హడలు కొడుతున్నారు. ఆయన మాట్లాడేది నాకు అర్థం అయి చావదు, అర్థం నాకు చెప్పరు, నాకు అర్థం కాకుండా ఉండాలనే ఆయన ఉద్దేశ్యం. ఇంట్లో ఏకాకినైపోయానే! అదేమంటే సంఝే సంఝే! అంటున్నారు" ఆవేదనతో చెప్పింది అన్నపూర్ణ.

నవ్వుకుంటూ వింటున్నాడు అల్లుడు ఆనంద్.

వెంటనే అందుకున్నాడు మనవడు వెంకట్, "అమ్మమ్మా! నీ ప్రాబ్లం నేను సాల్వ్ చేస్తా! తాతయ్య చేత ఆ భాష మాన్పిస్తా!" అన్నాడు.

"ఎలారా! ఎలా మాన్పిస్తావ్? నువ్వు ఆ పని చేసావంటే చచ్చి నీ కడుపున పుడతారా!" అన్నది అన్నపూర్ణ.

"నా ఫ్రెండ్ చైతన్య వాళ్ళ నాన్న సుధాకర్‌గారు రాజమండ్రిలో పెద్ద హిప్నాటిస్ట్. వాళ్ళింటికి వెళ్ళినప్పుడల్లా ఆయన కొంతమందికి హిప్నాటిజం నేర్పటం చూస్తూ నేను కూడా చాలా వరకు నేర్చుకున్నా. హిప్నాటిజంతో సిగిరెట్టు, త్రాగుడు మాన్పిస్తుంటారు అంకుల్, అలానే నేను తాతయ్య చేత ఆ భాష మాన్పిస్తా!" అన్నాడు.

"నువ్వు చెప్పేది నిజమేనట్రా? వేలెడు కుంకవి నువ్వు చెయ్యగలవా? ఏదైనా అటూ ఇటూ అయి ఆయనకు ఉన్న మతి పోతే?" అడిగింది అన్నపూర్ణ.

"ఏమీ ఫరవాలేదు అమ్మమ్మా! నేను చేస్తా చూడు" అంటుండగా తలుపు చప్పుడు. వెంకట్ వెళ్ళి తీయగానే భుజంగరావు లోపలికి వచ్చాడు.

"క్యాహువా? అప్ లోగ్ క్యా బాచ్చిత్ కర్రయ్?" అడిగాడు. అందరూ నవ్వు ఆపుకొని చూస్తుంటే అన్నపూర్ణ మాత్రం విసుగు, వికారం కలిపిన చూపు చూసింది.

అన్నపూర్ణ తయారైన తరువాత ఆమెను కుర్చీలో కూర్చోపెట్టి, కూతురు అల్లుడు ఆమెకు బట్టలు పెట్టి, కాళ్ళకు నమస్కారం చేసి ఆశీర్వచనం తీసుకున్నారు.

వెంకట్ కూడా నమస్కారం పెట్టి "హ్యాపీ బర్త్ డే అమ్మమ్మా!" అన్నాడు.

"మరి నీ గిఫ్ట్ ఏదిరా?" అడిగింది మనవణ్ణి.

"నువ్వు అడిగింది చేసిపెట్టడమే నేను నీకిచ్చే గిఫ్ట్!" అన్నాడు వెంకట్.

"జన్మదిన్ ముబారక్!" అన్నాడు భుజంగరావు భార్యకు తను తెచ్చిన చీర ఇస్తూ.

ఇక ఆలస్యం చేయకుండా మొదలుపెట్టాడు వెంకట్. "తాతయ్యా! మనం సరదాగా ఒక చిన్న పని చేద్దామా?" అడిగాడు.

"క్యాహయ్" అన్నాడు భుజంగరావు.

"ఏమీ లేదు తాతయ్యా! నేను హిప్నాటిజం నేర్చుకుంటున్నా, నేను నేర్చుకున్నది అమ్మమ్మకి చూపాలి బర్త్‌డే సందర్భంగా, నిన్ను హిప్నాటైజ్ చేసి నిద్రపుచ్చి మళ్ళీ లేపుతా అంతే!" అన్నాడు.

"ఐసా! ఠీక్ హై, అబ్ మై క్యా కర్నా హై బోలో" అడిగాడు భుజంగరావు.

"నువ్వు ఆ మంచం మీద పడుకొని నేను చెప్పినట్లు చేస్తే చాలు" అన్నాడు వెంకట్.

వెంటనే భుజంగరావు వెళ్ళి మంచం మీద పడుకున్నాడు.


వెంకట్ కమాండ్స్ ఇవ్వడం మొదలుపెట్టాడు. "తాతయ్యా! గట్టిగా గాలి పీల్చు, కళ్ళు మూసుకో, నీకు నా మాటలు మాత్రమే వినపడుతున్నాయి. నేను ఒకటి నుండి పది అంకెలు లెక్కపెట్టేసరికి నీకు నిద్ర వస్తుంది. ఒకటి రెండు మూడు, నీకు నా మాటలు మాత్రమే వినిపిస్తున్నాయి. నాలుగు, ఐదు, ఆరు, నీవు రిలాక్స్ అవుతున్నావు, ఏడు ఏనిమిది, మరే శబ్దాలు వినిపించటం లేదు నా మాటలు మాత్రమే వినపడుతున్నాయి. తొమ్మిది, పది నీవు పూర్తిగా నిద్రలోకి వెళ్ళిపోయావు" అన్నాడు.

నిజంగా భుజంగరావు నిశ్శబ్దంగా నిద్రపోతున్నాడు.

"తాతయ్యా! నేను చెప్పేది జాగ్రత్తగా విను, నీకు హిందీ మాట్లాడటం అంటే ఇష్టం ఉండదు, ఇకపై అసలు హిందీ మాట్లాడవు, ముఖ్యంగా అమ్మమ్మతో, సరేనా?" అడిగాడు.

"సరే" అన్నట్లు తలూపాడు భుజంగరావు.

"అమ్మమ్మా! ఇక తాతయ్య హిందీ మాట్లాడడు. ఇంకో తమాషా చేస్తా చూడు అని మళ్ళీ "తాతయ్యా! నేను ఒక్కొక్క అంకె లెక్క పెట్టేసరికి నీవు ఒక్కొక్క సంవత్సరం వెనుకకు వెళతావు. అంటే నీ వయసు తగ్గిపోతుందన్నమాట" అని చెప్పి భుజంగరావుకి వయసు ఇరవై అయిదు సంవత్సరాలు వరకూ తెచ్చి "నీవు నిద్రలోనే ఉన్నావు. చిన్నగా కళ్ళు తెరువు" (భుజంగరావ్ కళ్ళు తెరిచాడు). "నీ భార్యని ఏమని పిలుస్తావో ఈ పేపర్ మీద వ్రాయి" అని పేపర్, పెన్ను ఇచ్చాడు. దాని మీద భుజంగరావు- "అన్నూ డార్లింగ్" అని వ్రాసాడు. అందరూ ఆశ్చర్యంగా చూసి నవ్వుకున్నారు.



అన్నపూర్ణ కాస్త సిగ్గుపడి "ఇదంతా నిజమేనట్రా!" అడిగింది.

"అవును అమ్మమ్మా! ఇప్పుడు తాతయ్య వయసు పాతిక సంవత్సరాలు" అన్నాడు.

"అవున్రా! అంటే మాకు పెళ్ళయిన సంవత్సరం అన్నమాట" అన్నది.

"అలాగా! అయితే మరొక తమాషా చేస్తా చూడు" అని


"తాతయ్యా! మీ అన్నూ డార్లింగ్‌ని ఈమధ్య ఏ సినిమాకి తీసుకెళ్ళావు" అడిగాడు.

దానికి అతను "తేనె మనసులు" అని వ్రాసాడు.

"అవునురా! పెళ్ళి అయిన తరువాత మేము చూసిన మొదటి సినిమా అదే! ఆశ్చర్యంగా ఉందే" అన్నది.

"అప్పుడే ఏమయింది ఇంకా చూడు" అని వెంకట్ భుజంగరావుని మరో అయిదు సంవత్సరాలు వెనక్కి పంపించి- "తాతయ్యా! ఇప్పుడు నీ వయసు ఇరవై ఏళ్ళు. మీ కాలేజీలో నీకు నచ్చిన ఫ్రెండ్ ఎవరు?" అడిగాడు.

దానికి భుజంగరావు "రాధ" అని వ్రాసాడు. అందరూ నవ్వుకుంటుంటే అన్నపూర్ణ మాత్రం మూతి విరిచింది.




ఎక్కువ ప్రశ్నలేస్తే ఇంకేమి వ్రాస్తాడో అని భయపడి వెంకట్ భుజంగరావుని మరో పదిహేను సంవత్సరాలు

## బిపాషా సంబరం

బాలీవుడ్‌లో హీరోయిన్‌గా కంటే ఇటీవల కాలంలో ఐటమ్ గాళ్‌గా ఎక్కువ బిజీగా వుండడమే కాకుండా కేవలం ఐటమ్ నంబర్‌కే మంచి గిట్టుబాటు సొమ్ముని డిమాండ్ చేస్తున్న బెంగాలీ భామ బిపాషా బసు మొత్తానికి ఇన్నాళ్లకి తన మాతృభాషలో నటిస్తోంది. ఆమె తాజాగా ఓ బెంగాలీ సినిమాలో నటిస్తోంది. కోల్‌కతాలో షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాలో చాన్స్ రావడంతో సొంత భాషలో ఇన్నాళ్లకి నటిస్తున్న బిపాషా తెగ సంబరపడిపోతోందిట.

వెనక్కి పంపాడు.

"తాతయ్యా! ఇప్పుడు నీ వయసు అయిదు ఏళ్ళు, నీకు అసలు ఇష్టం లేని ఫ్రెండ్ ఎవరు?" అడిగాడు.

దానికి అతను "గణపతి" అని వ్రాసాడు.

"ఎందుకు ఇష్టంలేదు" మళ్ళీ అడిగాడు వెంకట్.

"వాడు నా బొంగరం పగలకొట్టాడు, నా పది పైసలు లాక్కున్నాడు" అని వ్రాసాడు.

"అమ్మమ్మా చూస్తున్నావా? ఇప్పుడు చూడు ఇంకా వెనక్కి తీసుకు వెళితే వాళ్ళ అమ్మ పొట్టలో ఉన్నంత వరకూ తీసుకెళతాడు" అని అంకెలు వెనక్కి లెక్క పెడుతున్నాడు.

భుజంగరావులో రకరకాల మార్పులు, చివరికి ముడుచుకొని పడుకున్నాడు. అయినా వెంకట్ ఆగకుండా ఇంకా లెక్క పెడుతున్నాడు. అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. భుజంగరావు ముఖకవళికలు మారిపోతున్నాయి. ఒక్కసారిగా లేచి కూర్చున్నాడు.

"తాతయ్యా! తాతయ్యా!" అని పిలుస్తున్నాడు వెంకట్. ఇప్పటి దాకా శిలలా కూర్చున్న భుజంగరావు అందరి వైపు చూస్తూ "హూ ఆర్ యూ? వేర్ యామ్ ఐ? వాటీజ్ గోయింగ్ ఆన్ హియర్?" అని గుడ్లు మిటకరించాడు.

"ఇదేమిటిరా?



ఈయన ఇంగ్లీషు మొదలుపెట్టాడు?" ఆశ్చర్యంగా అడిగింది అన్నపూర్ణ.

"అదే నాకూ అర్థం కావటం లేదు అమ్మమ్మా!" అని "వాటీజ్ యువర్ నేమ్? వేర్ ఆర్ యూ ఫ్రమ్?" అడిగాడు వెంకట్.

"నేమ్? మై నేమ్? డోంట్ యు నో మై నేమ్? అయామ్ జార్జి పీటర్స్. సైంటిస్ట్ ఆఫ్ వాష్టింగ్టన్, డోంట్ యూ నో దట్?" గదిమాడు భుజంగరావు.

"అమ్మమ్మా! పొరపాటు జరిగింది. తాతయ్య గత జన్మలోకి వెళ్ళినట్లు న్నాడు. ఇప్పుడు ఆయన అమెరికాకు చెందిన జార్జి పీటర్సట" అన్నాడు.

"ఓరి నాయనో! కొంప మునిగిందిరో! కొండ నాలికకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లు ఇలా చేసావేం దిరా? ఇప్పుడు ఈ పీటర్‌తో నేనెట్లా వేగేదిరా? ఈయన హిందీకి అందరం హడలి ఛస్తున్నాము. ఇప్పుడు మోహాన తుంపర్లు పడేట్లు ఈ ఇంగ్లీషు ఏమిట్రా? ఇప్పుడు నేనేం చెయ్యాలిరో దేవుడో!" అని రాగాలు తీస్తున్నది అన్నపూర్ణ.

"నువ్వు ఉండు అమ్మమ్మా! నన్ను గాబరా పెట్టకు. సుధాకర్ అంకుల్ చెబుతుంటారు. ఎంత హిప్నటైజ్ చేసినా గత జన్మలోకి వెళ్ళరని, మరి ఇలా ఎందుకు జరిగిందో అర్థం కావడం లేదు. ఉండు. అంకుల్‌కి ఫోన్ చేస్తాను" అని తన జేబులో నుంచి సెల్ ఫోన్ తీసి నెంబర్లు నొక్కుతుంటే భుజంగరావు లేచి వచ్చి ఆ ఫోన్ లాక్కొని "భడవా! తాతను నన్నే బొమ్మను చేసి ఆడిస్తావుట్రా?" అని వెంకట్ చెవి మెలితిప్పాడు.

అందరూ ఆశ్చర్యపడ్డారు.

"అయితే తాతయ్య నువ్వు?" అని అడగబోతుంటే,

"హిప్నాటిజం లేదు నీ తలకాయ లేదు, ప్రొద్దున్న బజారు నుండి వచ్చాక తలుపు చాటు నుంచి మీ మాటలన్నీ విన్నా. మీ అమ్మమ్మ నీకు నా హిందీ గురించి చెప్పడం, నీ హిప్నాటిజం ప్లాను, అంతా తెలుసుకొని నిన్ను ఆట పట్టిద్దామని హిప్నటైజ్ అయినట్లు నటించా" అన్నాడు.

"అంతా నటనా? భయపడి చచ్చాను కదయ్యా!" అన్నది అన్నపూర్ణ.

"రెండు రోజులు సరదాగా హిందీ మాట్లాడితే నా మీద ఇంత కుట్ర చేస్తావుటే? ఈసారి నాకు కోపం వచ్చిందంటే నిజంగానే జార్జిపీటర్ని అయిపోతా!" అన్నాడు భుజంగరావు అందరి నవ్వుల మధ్య.